రోడ్లు పూర్తయ్యేది ఎన్నడో!

- వెట్‌మిక్స్ దగ్గరే నిలిచిపోయిన పనులు
- చెల్లాచెదురైన కంకర.. గుంతలమయంగా రోడ్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో చేరిన వర్షపు నీరు



చెదిరిపోయిన వెట్ మిక్స్‌తో కంకర తేలిన మల్లారం-దమ్మపేట రోడ్డు

దమ్మపేట: మండల పరిధిలోని పలు బీటీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి కాకుండా మధ్యంతరంగా ఆగిపోయాయి. గత బీఆర్ఎస్ హయాంలో (అక్టోబర్, 2023) అప్పటి స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు చేతులమీదుగా ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులతో పలు అంతర్గత బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాగా నిర్మాణ పనులను కైవసం చేసుకున్న సదరు కాంట్రాక్టర్లు ఎర్త్ వర్క్ చేసి, వెట్ మిక్స్ పోసిన అనంతరం పనులను మధ్యలోనే అర్ధాంతరంగా నిలిపివేశారు. దీనికి కారణం సదరు కాంట్రాక్ట్ పనులకు సకాలంలో బిల్లులు చెల్లించని కారణమని తెలుస్తోంది. అసంపూర్తిగా వెట్ మిక్స్‌తో ఆపేసిన కారణంగా, వెట్ మిక్స్‌లోని కంకర అంతా పైకి తేలి, చిందరవందరగా కొట్టుకుపోయింది. దీనితో ఈ అసంపూర్తి రోడ్లు, ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ప్రమాదకరంగా మారాయి. ఈ కారణంగా ప్రమాదాలు జరిగినట్టుగా స్థానికులు చెప్తున్నారు.

మరలా వెట్ మిక్స్ పోయాల్సిందేనా?

మండల పరిధిలో నాడు పది బీటీ రోడ్లు మంజూరు కాగా.. ఐదు పూరయ్యాయి. మరో అయిదు బీటీ రోడ్లు మధ్యంతరంగా ఆగిపోయాయి. రోడ్లపై కంకర రాళ్లతా పైకి తేలి, పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. బిల్లులు సకాలంలో చెల్లింపులు జరగని కారణంగా కాంట్రాక్టర్లు సంవత్సరం గడుస్తున్నా, పనులు కొనసాగించడానికి ముందుకు రావట్లేదు. ఇంత ఆలస్యం తర్వాత నిర్మాణ పనులను మొదలుపెట్టిన, తిరిగి మళ్లీ వెట్ మిక్స్ పోయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందనే చర్చ స్థానికులు మధ్య నడుస్తుంది.

ఆగిపోయిన బీటీ రోడ్లు ఇవే..

- దమ్మపేట కార్పెంటర్ కాలనీ నుంచి మల్లారం ఆర్అండ్‌బీ రోడ్డు వరకు..
- గాంధీ నగరం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి మందలపల్లి రామాలయం వరకు..
- మందలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి ఎస్సీ కాలనీ వరకు..
- గంగులగూడెం నుంచి గుత్తవారిగూడెం వరకు..
- పెద్దగొల్లగూడెం నుంచి లంకలు వరకు..

ఇబ్బందికరంగా ప్రయాణం

గ్రామాల మధ్య అంతర్గత రహదారులను బీటీ రోడ్లతో అనుసంధానం చేసి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించాలనే సదుద్దేశంతో ప్రారంభించిన బీటీ రోడ్లు.. నిర్మాణ పనులను మధ్యలోనే ఆపేయడంతో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెట్ మిక్స్‌లో ఉన్న కంకర బయటకు తేలి, పాదాచారులు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. అంతేకాక రోడ్ల మధ్యలో గుంతలు ఏర్పడి, వర్షాల వలన ఆ గుంతలు నీటితో నిండిపోతున్నాయి. ఈ నీటి గుంతలు గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఆ అంతర్గత రోడ్ల మీదుగా రాత్రి సమయంలో విద్యుత్ సౌకర్యం కూడా లేని కారణంగా పాదాచారులు జారిపడే అవకాశాలు ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు కంకర వల్ల అదుపుతప్పి కింద పడిన సందర్భాలు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం..

మండలంలో అసంపూర్తిగా ఆగిపోయిన బీటీ రోడ్ల నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేస్తాం. ఇందుకు సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్నాం. ఆగిపోయిన పనులను వెంటనే కొనసాగించాలని సూచిస్తున్నాం. అవసరమైతే కాంట్రాక్టర్లకు నోటీసులను జారీ చేస్తాం.

– బాపనయ్య, ఐటీడీఏ డీఈ

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- వాగులే.. ఇసుక తావులు
- రాత్రివేళల్లో దూరప్రాంతాలకు తరలింపు



గుర్రాలకుంట బస్‌షెల్టర్ సమీపంలోని వాగు నుంచి ట్రాక్టర్లలో తోడుతున్న ఇసుక..

ములకలపల్లి: వాగుల్లో ఇసుక ఇసుకను అక్రమార్కులు దోచేస్తున్నారు. పగలూ, రాత్రీ తేడా లేకుండా ట్రాక్టర్లు, లారీల్లో దర్జాగా తరలిస్తూ, అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు.

ములకలపల్లి మండలవ్యాప్తంగా విస్తారంగా వాగులు ప్రవహిస్తూ ఉన్నాయి. సాకివాగు, సంగెళ్ల వాగు, ఊరవాగు, ముర్రేడు, పాములేరు తదితర వాగులు సుమారు 18 కిలోమీటర్ల మేర ప్రవాహం సాగుతూ ఉంటుంది. వర్షాకాలంతో వరద ఉధృతికి వాగుల్లోనూ, వాగు సమీపాల్లోనూ ఇసుక మేటలు వేస్తుంటారు. ఇవే ఇసుక రాశులు ఇసుకాసురులపాలిట వరంగా మారాయి.

30కి పైగా ట్రాక్టర్లలో..

గుర్రాలకుంట, సీతారాంపురం, వీకే, రామవారం, కొత్తూరు తదితర గ్రామాల శివార్లలోని వాగుల నుంచి అర్ధరాత్రి వేళ భారీగా ఇసుకను తరలిస్తున్నారు. స్థానికులతోపాటు, పాల్వంచకు చెందిన 30కి పైగా ట్రాక్టర్లలో ఇష్టారీతిని తోలకాలు సాగిస్తున్నారు. గుర్రాలకుంట నుంచి పాల్వంచకు ట్రక్కు రూ.3 నుండి రూ.5 వేలకూ విక్రయిస్తున్నారు. పాల్వంచ-ములకలపల్లి సరిహద్దుగా ఈ ప్రదేశం ఉండడంతోపాటు, పాల్వంచకు 3 కిలోమీటర్ల దూరంలోనే ఉండడంతో అక్రమార్కులు తెగబడుతున్నారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారే వరకూ ఇష్టారీతిన తోలకాలు సాగిస్తున్నారు.

లారీల్లో తరలింపు..

సీతారాంపురం, వీకే.రామవరం, కొత్తూరు శివార్లలోని వాగుల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక వాగు నుంచి బయటకు తరలిస్తున్నారు. జామాయిల్ తోటలు, రిసార్ట్స్ తదితర ప్రాంతాల్లో తమకు అనువైన చోట భారీగా నిల్వ చేస్తున్నారు. అటుపిమ్మట లారీల్లో బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కోలారీ రూ.15 నుంచి రూ.20 వేలకు వరకూ విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రివేళల్లో తోలకాలతోపాటు ఇక ప్రభుత్వ శెలవు దినాల్లో పట్టపగలే వాగుల నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఇటీవలే పోలీసులు ఒక్క ట్రాక్టర్ సీజ్ చేసినా, అక్రమార్కుల్లో మార్పు రాలేదు.

స్థానిక అధికారుల సహకారంతోనే ఈదందా మూడు ట్రాక్టర్లు, ఆరు లారీల చందగా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.కోట్లాది రూపాయల విలువైన ఇసుక అక్రమార్కులు పాలవుతున్నా.. సంబంధిత శాఖ అధికారులెవరూ స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ప్రత్యేక దృష్టి సారిస్తాం..



అక్రమ తోలకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ఇటీవలే ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేశాం. రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. తోలకాల నివారణే లక్ష్యంగా చర్యలు చేపడుతాం.

– మధుప్రసాద్, ఎస్సై, ములకలపల్లి

క్లుప్తంగా

కుల రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అశ్వారావుపేటరూరల్: కుల, మతం లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని దురదపాడు గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. కుల, మత అసమానతలు లేని సమాజం సోషలిజంతోనే సాధ్యమని అన్నారు. అనంతరం అన్ని వర్గాలతో కలిపి సహపంక్తి భోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసం బుచ్చిరాజు, కంగాల వెంకటేష్, మడకం రామకృష్ణ, కుంజా లక్ష్మి, ధర్మల శ్రీరాములు, కుంజా అర్జున్, పండా ముత్యాలు పాల్గొన్నారు.

2న మాంసం విక్రయాలు బంద్

అశ్వారావుపేట: అక్టోబర్ 2న గాంధీ జయంతి ఉండటంతో అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో మాంసం, చేపల విక్రయాలు చేయరాదని మున్సిపల్ కమిషనర్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. అక్టోబర్ 2న దుకాణాలను పూర్తిగా మూసి ఉంచాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకెళ్లొద్దు..

కరకగూడెం: ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినందున ప్రజలు రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకెళ్లరాదని కరకగూడెం ఎస్ఐ పీవీఎన్.రావు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి గరిష్ఠంగా రూ.50 వేలు మాత్రమే వెంట తీసుకెళ్లవచ్చని ఆయన చెప్పారు. అంతకన్నా ఎక్కువ మొత్తంలో నగదు సరైన పత్రాలు లేకుండా పట్టుబడితే దానిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, పెళ్లిళ్లు, వ్యాపార అవసరాల కోసం పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లేవారు తప్పనిసరిగా సంబంధిత ఆధారాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న వెంకటనారాయణ

దుమ్ముగూడెం: మండలంలోని అంజుబాక గ్రామంలో స్థానిక యువకులు నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను మంగళవారం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ కొమరం వెంకటనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఎప్పుడు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలన్నారు. మండల సీనియర్ క్రీడాకారుడు రాత్నాకర్, అంజుబాక క్రీడాకారుడు కుంజ తిరుపతిరావు, గ్రామ పెద్దలు బొర్రా బాబురావు, కుడుముల రాంబాబు, ఉబ్బ వేణు, ఉబ్బ చంటి, కె.సురేష్, టోర్నీకి రిఫెరీగా వ్యవహరిస్తున్న వెంకటేష్, దశమిబాబు పాల్గొన్నారు.

మహిళలకు వైద్యశిబిరం

పినపాక: మండలంలోని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మణుగూరు ఏరియా ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ అజంతా ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించగా.. మహిళలు విస్తృతంగా హాజరయ్యారు. షుగర్, బీపీ పరీక్షలు, గర్భిణులు, కిశోర బాలికలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగుతుందని వైద్యురాలు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శృతి, ఆరోగ్య సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

‘మహిళలను మోసం చేసిన కాంగ్రెస్’

అశ్వాపురం: ప్రభుత్వం ఇస్తామన్న ఇందిరమ్మ చీరలు ఆడపడుచులకు ఇవ్వకుండా తెలంగాణ ప్రభుత్వం మహిళలను మరోసారి మోసంచేసిందని బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు భాగవతపు సతీశ్ విమర్శించారు. అశ్వాపురంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సద్దుల బతుకమ్మ ముగిసినప్పటికీ ఇందిరమ్మ చీరలు జాడ లేవని, కనీసం దసరా పండుగ లోపైనా ఆడపడుచులకు చీరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని తాటివారిగూడెంకు చెందిన విద్యార్థిని కుంజా సవిక్య చేయి విరిగి చికిత్స పొందుతుండగా.. బ్యూటిఫుల్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.2వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఎల్ఎఫ్ సభ్యులు శీలం సంతోష్, తాటి ప్రవీణ్, మడకం సంతోష్, తుర్రం లోహిత్, శ్యామల రిషి, చరణ్, సోడె సందీప్, పాండురాజు, సమీర్ పాల్గొన్నారు.

గంజాయి రహితంగా మార్చాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

పినపాక: మండలాన్ని గంజాయి రహిత మండలంగా మార్చాలని ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన మంగళవారం సీతంపేట గ్రామంలో గంజాయి సేవించడం వలన కలిగే దుష్ప్రభావాలను గ్రామ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి సేవించినా, వ్యాపారం చేసినా చట్ట ప్రకారం కఠిన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. ఇటీవల నమోదైన ఒక గంజాయి కేసులో నిందితుల వాహనాలపై ఫ్రీజింగ్ ఆర్డర్ జారీ చేసి, రూ.23 లక్షల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి వాడినా,విక్రయించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, ఏఎస్ఐ మల్సూర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

86 శాతం బొగ్గు ఉత్పత్తి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సెప్టెంబర్ నెలలో 7.56లక్షల టన్నులకు గాను 6.47లక్షల టన్నులతో 86 శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్లు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏరియాలో సెప్టెంబర్‌లో కురిసిన వర్ష ప్రభావంతో బొగ్గు, ఓబీ ఉత్పత్తిపై పడిందన్నారు. సమావేశంలో ఏరియా అధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద ఆందోళన



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ యయాతి రాజు

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను నిరుపేదలకు కేటాయించకుండా రాజకీయ నాయకుల అనుచరులకు కేటాయించారని.. తాము ఉంటున్న ఇళ్లను ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని కొందరు పేదలు మంగళవారం ఆందోళకు దిగారు. అశ్వారావుపేటకు రాష్ట్ర సరిహద్దులో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల గ్రామసభలు నిర్వహించి ఎవరికీ కేటాయించకుండా వదిలేయగా.. ఎన్నికల కోడ్‌కు ముందు ప్రస్తుత పాలకులు హడావిడిగా కేటాయించేశారు. లబ్ధిదారుల జాబితాలో పేర్లున్న వారు వారికి కేటాయించిన ఇంటిని స్వాధీన పరుచుకునేందుకు వెళ్లగా అప్పటికే ఆ ఇంట్లో వేరే వ్యక్తులుంటున్నారు. దీంతో ఇరువురికీ గొడవలై విషయం బయటకు వచ్చింది. ఇళ్లు మాకు కేటాయించాలని డిమాండ్ చేసే వారికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు వచ్చి నిలుచున్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల వద్దకు ఎస్ఐ యయాతి రాజు చేరుకుని ‘ప్రభుత్వం ప్రకటించిన పేర్లు ఉన్న వారు ఇళ్లలో ఉండవచ్చు. మీకు అభ్యంతరాలుంటే కోర్టులో పరిష్కరించుకోవాలి’అని చెప్పి ఇరు వర్గాలను శాంతింపజేశారు.

ఒకే నెలలో 52 ప్రసవాలు



ఆస్పత్రిలో కాన్పు చేయించుకున్న తల్లితో వైద్య బృందం

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలతో కొత్త రికార్డులు నమోదు అవుతున్నాయి. ఆస్పత్రిలో గతంలో నెలకు కేవలం ఐదు నుంచి ఆరు మాత్రమే ప్రసవాలు నమోదు కాగా.. తాజాగా సెప్టెంబర్ నెలలో ఏకంగా రికార్డు స్థాయిలో ఒకే నెలలో 52 ప్రసవాలు జరిగి కొత్త రికార్డు నమోదైంది. వీటిలో 26 సాధారణ ప్రసావాలుగా నమోదు కావడం విశేషం. ఈ మేరకు మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధ రుక్మిణి వివరాలు వెల్లడించారు. ఆస్పత్రి వైద్యుల బృందం ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించేలా సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో ప్రసూతి వైద్యురాలు డాక్టర్ మౌనిక, మత్తు వైద్యులు డాక్టర్ శంకర్‌రావు, డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, డాక్టర్ ప్రకాష్, నర్సింగ్ సిబ్బంది మంగ, ప్రమీల, సుజాత, వీరాకుమారి, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

దమ్మపేట: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని మంత్రి తుమ్మల నివాసంలో మంత్రితో కలసి స్థానిక ఎన్నికల నేపథ్యంలో అంతర్గతంగా చర్చించారు. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో తగు జాగ్రత్తలు వహించి, గెలుపే లక్ష్యంగా నిర్ణయాలు ఉండాలని సూచించారు. అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని పలువురు మంత్రి తుమ్మలను కలసి, పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పినపాక: మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. మంగళవారం పినపాక ఎమ్మెల్యే పాయం సమక్షంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు బొలిశెట్టి నర్సింహారావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే ముకుందాపురం, దుబ్బగుంపు,సింగిరెడ్డిపల్లి గ్రామాల నుండి 40 కుటుంబాలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరాయి. అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులపై పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి రూపంలో అమ్మవారు



అశ్వారావుపేటరూరల్: దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు..

దమ్మపేట: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని, మండలంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో మంగళవారం అమ్మవారిని దుర్గాదేవి రూపంలో అలంకరణ చేశారు. దమ్మపేట గాంధీ బొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండపం వద్ద అన్నదానం ఏర్పాటు చేయగా, వందల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రాదాలను స్వీకరించారు.

అశ్వారావుపేటరూరల్: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు భక్తులకు దుర్గాదేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. మండలంలోని నారంవారిగూడెం(శ్రీరంగాపురం) వద్దగల విజయదుర్గ అమ్మవారి ఆలయం, ఊట్లపల్లి, వినాయకపురం, మామిళ్లవారిగూడెం, అశ్వారావుపేటలోని ఆలయాలు, మండపాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పర్ణశాలలో వీరలక్ష్మి అలంకరణ..

దుమ్ముగూడెం: పర్ణశాల పుణ్యక్షేత్రం సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 8వ రోజు మంగళవారం లక్ష్మి అమ్మవారు వీరలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం లక్ష్మి అమ్మవారికి ఆలయ అర్చకులు కుంకుమార్చన కార్యక్రమాన్ని సాంప్రదాయానుసారంగా ఘనంగా నిర్వహించారు. ఈ కుంకుమార్చనలో భక్తులు గ్రామస్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ఆలయ అర్చకులు విష్ణువర్ధనాచార్యులు, భార్గవాచార్యులు, నరసింహాచార్యులు, వెంకటాచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ సమరంపై సభలు

కలిసికట్టుగా పనిచేయాలి..



చంద్రుగొండ: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

చంద్రుగొండ: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించేలా అందరూ కలసికట్టుగా పనిచేయాలని, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పార్టీ శ్రేణులకు సూచించారు. మంగళవారం మండలంలోని దామరచర్ల గ్రామంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎంపికలో స్థానిక నాయకులే సమిష్టి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ దిశగా గ్రామ పంచాయితీల వారీగా కమిటీలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగ సీతారాములు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, నాయకులు భోజ్యా నాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, గుగులోతు బాబు, సారేపల్లి శేఖర్, నరసింహారావు, అన్వర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాల్లో..

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి, మొండివర్రె, పార్కలగండి, అంకంపాలెం, జగ్గారం, బాలరాజుగూడెం, ఆర్లపెంట గ్రామాల్లో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం రాత్రి పాల్గొన్నారు. స్థానిక మహిళలు, యువతులతో కలసి, ఉత్సాహంగా బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యం చేశారు.

సత్తాచాటుతాం..



కరకగూడెం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

కరకగూడెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుతామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. కార్యకర్తలే కాంగ్రెస్‌పార్టీకి బలమని అందరు కలసి మెలసి పార్టీ సూచించిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. అనంతరం పలు పార్టీల నుండి నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ చందా సంతోష్, పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, మాజీ సర్పంచులు పోలెబోయిన తిరుపతయ్య, తోలెం నాగేశ్వరరావు,నాయకులు ఎర్ర సురేష్, బిజ్జ రామనాథం, జలగం కృష్ణ, కుంజ వసంతరావు,నాగ బండి వెంకటేశ్వర్లు, పడిగా సమ్మయ్య, గొగ్గలి రవి, భూక్యా రాందాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు..

ములకలపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని టీడీపీ అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కట్రం స్వామి దొర పార్టీ శ్రేణులుకు పిలుపునిచ్చారు. రాజుపేట గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల చెన్నయ్య స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. టీడీపీ పూర్వవైభవానికి శక్తివంచనలేకుండా కృషి చేయాలని తెలిపారు. అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి మండల అధ్యక్షులు శ్రీనివాస రావు, పానుగంటి రామారావు, దమ్మపేట సొసైటీ వైస్ చైర్మన్ కట్రం ఎర్రప్ప, తన్నీరు చిన్నపుల్లయ్య, గంగిశెట్టి సత్యం, చల్లా వెంకటేశ్వర్లు, కోమాళ్ల దుర్గాప్రసాద్, బిక్కుమళ్ల సుధాకర్, గుమ్మడి దేవస్వామి, శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి టీడీపీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ పినపాక నియోజకవర్గ అడ్‌హక్ కమిటీ సభ్యుడు వట్టం నారాయణదొర తెలిపారు. మంగళవారం గుట్టమల్లారంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు, పంచాయతీ, వార్డ్ స్థానాలకు టీడీపీ పోటీ చేస్తుందన్నారు. అవసరమైతే కలిసివచ్చే పార్టీలతో పొత్తులు ఉంటాయని తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్ బచ్చల భారతి, నాయకులు యలమాటి పూర్ణచందరరావు, దొడ్డి కృష్ణ, మల్లిడి లోకేష్, యార్లగడ్డరాజా, మద్దెల భద్రయ్య, వెంకట్రావు,సుధాకర్, ఆంజనేయులు, చందర్‌రావు, శ్రీరాములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి..

అశ్వాపురం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డుసభ్యుల్లో అభ్యర్థి ఎవరైనా బీఆర్ఎస్ పార్టీ గెలుపే ముఖ్యమని, ఎన్నికల్లో గులాబి జెండా ఎగురవేయాలన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కందుల కృష్ణార్జున్‌రావు, నాయకులు ఈదర సత్యనారాయణ, చల్లా రాజేష్, బాగోతపు సతీష్, చిలకా వెంకటరామయ్య, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలిసొచ్చే శక్తులతో ముందుకు..



ములకలపల్లి: మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కనకయ్య

ములకలపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కలిసొచ్చే శక్తులతో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, పొడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, నిమ్మల మధు, పాయం అమల తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని స్థానాల్లో సీపీఐ పోటీ చేయాలని, పార్టీ తోటి కలిసి వచ్చే లౌకిక శక్తులతో పొత్తులు ఉంటాయని తెలిపారు. సమావేశంలో సీపీఐ అశ్వాపురం మండల కార్యదర్శి, అనంతనేని సురేష్, మండల సహాయ కార్యదర్శులు, వేల్పుల మల్లికార్జున్, మేలాపురం సురేందర్ రెడ్డి, ముత్తబోయిన వెంకటేశ్వర్లు, తెల్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.